రహదారి వెంట చెట్ల నరికివేత

కోటగిరి-పొతంగల్ రహదారి పక్కన నరికివేతకు గురైన చెట్టు

కోటగిరి, జూన్ 10 : తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా పథకం కింద రహదారుల వెంట నాటిన చెట్లను పూర్తిగా ఎదగకముందే నరికేస్తున్నారు. దీంతో ఏటా ఎన్ని మొక్కలు నాటినా ప్రయోజనం లేకుండా పోతున్నది. మండలంలోని కోటగిరి- పొతంగల్ ప్రధానరోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు ఏపు ఎదుగుతున్న క్రమంలో ఇటీవల కొందరు కొమ్మలు, మొదళ్లను పూర్తిగా నరివేశారు. ఒక వైపు నాటడం.. మరో వైపు నరకడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. హరితహారం చెట్ల నరికివేతపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న గ్రామస్తులు

కోటగిరి, జూన్ 10 : ఉమ్మడి మండలంలోని మంజీర పరీవాహక ప్రాంతాల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని కోటగిరి మండల తహసీల్దార్ సునీత హెచ్చరించారు. ఇసుక అవసరమున్న వారు తహసీల్దార్ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. సుంకిని వద్ద ఉన్న మంజీరా నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎత్తొండ గ్రామస్తులు సోమవారం పట్టుకొని, కోటగిరి తహసీల్దార్ సునీతకు సమాచారం అందించారు. ఆమె రెవెన్యూ సిబ్బందిని ఎత్తొండకు పంపి, లోడ్‌తో ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను కోటగిరి తహసీల్ కార్యాలయానికి తరలించారు.

కేంద్ర మంత్రులుగా పదవులు పొందిన జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

- వినాయక్‌నగర్, జూన్ 10

తహసీల్దార్ ఎదుట నలుగురి బైండోవర్

ఇందల్వాయి, జూన్ 10 : వెంగళ్‌పాడ్‌కు చెందిన ముగ్గురు, దేవీతండాకు చెందిన ఒకరిని సోమవారం తహసీల్దార్ వెంకట్‌రావు ఆధ్వర్యంలో బైండోవర్ చేశారు. పక్కా సమాచారం మేరకు సారా కాస్తున్న నలుగురిని ఎక్సైజ్ సీఐ వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ఆశ్రమంలో అన్నదానం

ఆర్మూర్‌టౌన్, జూన్10: పట్టణంలోని తపస్వీ స్వచ్ఛంద సేవా సంస్థ (ఆశ్రమానికి) సోమవారం ఘటడి సాత్విక్ జన్మదినం సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు ఆశ్రమ విద్యార్థులకు అన్నదానం చేశారు. ఆశ్రమ విద్యార్థులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని అన్నారు.

నేడు బియ్యం వేలం

మోర్తాడ్, జూన్10: అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన 265.40క్వింటాళ్ల బియ్యానికి మంగళవారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 11 గంటలలోగా రూ.వేయి దరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

కందకుర్తిలో గ్రంథాలయం ప్రారంభం

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న బిలోలి మాజీ ఎమ్మెల్యే

రెంజల్, జూన్ 10: మండలంలోని కందకుర్తి గ్రామంలో విజయ్‌కుమార్ గుమాలేదర్ స్మారకార్థం ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని సోమవారం మహారాష్ట్రలోని బిలోలి తాలుకా మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ గంగాధర్ పాట్నే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం వివిధ రకాల పుస్తకాలు, దిన పత్రికలను సొంత ఖర్చుతో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన విజయ్ మెమోరియల్ ఫౌండర్ దీపక్ గుమాలేదర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదవ్‌రావు, మాదవ్ పాట్నే, సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

మాక్లూర్, జూన్10: మండలంలోని వల్లభపూర్ గ్రామంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం గ్రామానికి చెందిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రిటైర్డ్) సంతె గంగాధర్ తన కూతురు స్నేహంజలి జన్మదినం సందర్భంగా నోట్ పుస్తకాలను అందచేశారు. సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, మహేశ్, సంజీవ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నందిపేట్, జూన్ 10: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐపీకేఎంఎస్ నాయకుడు కె.గంగాధర్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. చాలా మందికి జీరో విద్యుత్ బిల్లు రావడం లేదని అన్నారు. కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

ఎడపల్లి, జూన్ 10: మండల కేంద్రంలో ఒకరు అదృశమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు(36) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంది. ఆచూకీ తెలియకపోవడంతో పల్లికొండ కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ సమస్య పరిష్కరించాలి

నందిపేట్, జూన్ 10: మండలంలోని చౌడమ్మ కొండూర్ ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎత్తిపోతల కమిటీ సభ్యులు అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఎత్తిపోతల పథకం మొదటి పంపుహౌస్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాయల్స్, ఆయిల్‌ను దుండగులు దొంగలించారని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయించి లిఫ్ట్ నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిటీ చైర్మన్ ఓంకార్, వైస్‌చైర్మన్ భూమేశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

బోధన్ మండలం సంగంలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గోవిందపేట్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నడ్పల్లి తండాలో..

నందిపేట్/మోర్తాడ్/బోధన్ రూరల్/ఆర్మూర్‌టౌన్/మాక్లూర్/డిచ్‌పల్లి, జూన్10: జిల్లాలో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను, బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వపాఠశాలలో చేరడంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. మోర్తాడ్ ఎలాలవాడ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నలుగురు విద్యార్థులను బడిలో చేర్పించినట్లు హెచ్ఎం దండు గంగాధర్ తెలిపారు.

డొంకేశ్వర్ గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. బోధన్ మండలంలోని సంగం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఆర్మూర్ మండలం గోవిందపేట్‌లో ప్రధానోపాధ్యాయురాలు ఇందిర ఉపాధి హామీ కూలీలను కలిసి అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు సునీత, సుజాత, మేరి, మహేశ్, రాజేశ్, లింబాగౌడ్, రాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ ఐదేండ్లపై బడిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, మూడేండ్లకు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సరిత, అంజలి, నసీమా, భారతి, స్వప్న పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని నడ్పల్లి తండాలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, సెక్రటరీ జయశ్రీ, స్కూల్ టీచర్స్ ఎం.శంకర్, తుకారాం, అంగన్‌వాడీ టీచర్లు భారతి, పుష్ప పాల్గొన్నారు. నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అమృతాపూర్ ఒడ్డెర కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. హెచ్ఎం పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, జూన్ 10 : పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన చట్టాలు పక్కాగా అమలయ్యేలా చూడాలని, సంబంధి శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గోవధ నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలని అన్నారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు కందకుర్తి ,సాటాపూర్, సాలురా, పొతంగల్, ఖండ్ గావ్, యంచ, పోచంపాడ్, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో పశువులను తరలిస్తే సీజ్ చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీజ్ చేసిన పశువులకు స్థానికంగానే షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశుగ్రాసం, నీటివసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడబడితే అక్కడ పశువులను వధించకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథాచారి, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ ఏవో సిద్ధిరాములు, నగర పాలక సంస్థ ఎంహెచ్‌వో సాజిద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారుల ఉచ్చులో పడొద్దు

మాట్లాడుతున్న ఏఈవో రేష్మ

బాల్కొండ, మే 10: రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ విస్తరణాధికారిణి రేష్మ అన్నారు. సోమవారం క్లస్టర్ పరిధిలోని నాగపూర్‌లో రైతులకు పంట లసాగుపై అవగాహన కల్పించారు. కొంతమంది రైతులు తమకు కావాల్సిన విత్తన బ్రాండ్ల కోసం విత్తన వ్యాపారులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారని, ఇలా చేయడంతో ఆయా విత్తనాల బ్రాండ్ల కృత్రిమ కొరత ఏర్పడడానికి రైతులే కారణమవుతారని అన్నారు. తొలకరి వర్షాలకు విత్తనాలు విత్తుకోవద్దని సూచించారు. నేలలో సరైన తేమ ఉన్నప్పుడు విత్తుకుంటే మొలక శాతం బాగుంటుందని, బరువైన నేలలలో 70 మిల్లీమీటర్లు, తేలికపాటి నేలల్లో 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే పంట విత్తుకోవాలని సూచించారు. గ్రామాల్లో తిరుగుతూ విడిగా విత్తనాలు, పురుగుమందులు విక్రయించే నకిలీ వ్యాపారుల ఉచ్చులో పడవద్దని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

మదన్‌పల్లిలో పాఠశాల పనులను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్

మాక్లూర్, జూన్ 10: మండలంలోని మదన్‌పల్లి, ముత్యంపల్లి గ్రామాల్లో సోమవారం బడిబాట కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఒడ్డెట్‌పల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. 100 రోజులు పనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జైక్రాంతి, ఏఈ పీఆర్ శ్రీనివాస్, కార్పొరేటర్ రాయిసింగ్‌నాయక్, ఎంపీటీసీ ఒడ్డెన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉపాధ్యాయులతో సోమవారం కిక్కిరిసింది. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీల సందర్భంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు సర్టిఫికెట్లు, ఇతర పత్రాలు తీసుకొని రావడం, అధికారులు వెరిఫికేషన్ చేపట్టడంతో డీఈవో కార్యాలయం సందడిగా మారింది.

- ఖలీల్‌వాడి, జూన్ 10

పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ

మోర్తాడ్‌లో పుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో

మోర్తాడ్/ఏర్గట్ల/రెంజల్/బాల్కొండ, జూన్ 10: మోర్తాడ్‌లోని భవిత పాఠశాల వద్ద మోర్తాడ్ బాలికల ఉన్నతపాఠశాల, ఏర్గట్ల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను ఎంఈవో ఆంధ్రయ్య సోమవారం అందజేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు 16,839, 5నుంచి 10వ తరగతి విద్యార్థులకు 13వేల నోట్‌బుక్స్ వచ్చాయని, వీటన్నింటిని త్వరలో పాఠశాలలకు అందజేస్తామని తెలిపారు. సీఆర్పీలు సాయిరాం, సురేశ్, మహేందర్, పరిమళ, ఐఈఆర్‌పీలు మధుశేఖర్, ప్రేమలత పాల్గొన్నారు.

ఏర్గట్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యాధికారి ఆంధ్రయ్య తెలిపారు. ఏర్గట్ల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుకి పాఠ్య పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. మిగతా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌సీకి వచ్చి పాఠ్య పుస్తకాలను తీసుకెళ్లాలని కోరారు.

రెంజల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో యునిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లను ఎంపీపీ లోలపురజిని, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావు కులకర్ణి హెచ్ఎంలకు అందజేశారు. పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల సోమలింగంగౌడ్, సీహెచ్ సాయారెడ్డి, హెచ్ఎంలు అంజనేయులు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ విద్యార్థుల యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను మండల విద్యాశాఖ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఫయాజ్, వెంకటేశ్, మండల విద్యాధికారి రాజేశ్వర్, మండల సమాఖ్య ఏపీఎం గంగాధర్, సమైక్య సీసీలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆర్మూర్‌టౌన్,జూన్10: మండలంలోని చేపూర్ శివారులోని దుబ్బాక సంజీవ్‌కు చెందిన వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైంది. ఎస్సై అశోక్ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో ఆర్మూర్ దవాఖాన వైద్యులతో పోస్టుమార్టం చేయించి ఘటన స్థలంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఆధారాలు లభించకపోవడంతో ఈ కేసు మిస్టరీగా మారింది.

చిన్నారులకు వైద్య పరీక్షలు

ఆర్మూర్‌టౌన్, జూన్10: పట్టణంలోని 32వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం-1 లో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సోమవారం డాక్టర్లు సంతోష్ కుమార్, మమత వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు సరైన ఆహారాన్ని అందజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శోభ, పార్మసిస్టు శ్రావణ్ గౌడ్, ఏఎన్ఎం వినోద పాల్గొన్నారు.

రోడ్లపై ముళ్ల పొదల తొలగింపు

ట్రాక్టర్‌తో రోడ్డు చదును చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు సొంతె రమేశ్

మాక్లూర్, జూన్10: మండలంలోని కల్లడి గ్రామానికి చెందిన సొంతె రమేశ్ గ్రామంలోని సాయినగర్ కాలనీలో సోమవారం శ్రమదానం చేశారు. తన సొంత ట్రాక్టర్‌తో ముళ్లపొదలను తొలగించారు. వానకాలంలో కాలనీ వాసులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించి గుంతలను పూడ్చి రోడ్డును చదును చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

వర్ని, జూన్ 10 : మండల కేంద్రంలోని మాదాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని సుమారు 350 మంది నిరుపేదలకు బియ్యం, నూనె, పప్పులు తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పీవీ సుబ్బారావు, ఠాగూర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లవెల్లి సహకార సంఘం నూతన చైర్మన్ ఎన్నిక

నోముల శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి మురళి

ఇందల్వాయి, జూన్ 10 : మండలంలోని నల్లవెల్లి సహకార సంఘం నూతన చైర్మన్‌గా నోముల శ్రీనివాస్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా సహకార సంఘ ఎన్నికల అధికారి మురళి తెలిపారు. కొన్ని రోజుల క్రితం నల్లవెల్లి సొసైటీకి అవిశ్వాసం ప్రకటించగా.. సోమవారం జిల్లా సహకార ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. డైరెక్టర్లందరూ కలిసి నోముల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సొసైటీ డైరెక్టర్లు, గ్రామస్తులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో నల్లవెల్లి సీఈవో తేజాగౌడ్, కోశాధికారి రాజన్నతో పాటు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అట్లాంట సభలో మెరిసిన ఇందూరు తార

ఆట మహాసభల్లో పాల్గొన్న లోరా మేదిసన్

సుభాష్‌నగర్, జూన్ 10 : అట్లాంటాలో మూడు రోజుల పాటు నిర్వహించిన 18వ అమెరికా తెలుగు సంఘం (ఆట) మహాసభలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సభలో నగర శివారులోని ముబారక్‌నగర్‌కు చెందిన వర్తమాన నటి లోరా మేదిసన్‌తో పాటు ప్రముఖ వ్యాఖ్యాత, నటి శ్రీముఖి పాల్గొన్నారు. ఒకే వేదికపై ఇద్దరూ పాల్గొని ఈవెంట్లలో తమ ప్రతిభ కనబర్చి, ఇందూరు కీర్తిని చాటారు. లోరా మేదిసన్ 2017లో తెలుగు చిత్ర సీమలో ప్రవేశించి గెస్ట్ హీరోయిన్ పాత్రలు పోషించారు. సైరా నర్సింహారెడ్డి, గువ్వ గోరింక, బజార్‌రౌడీ, బైరంపల్లి తదితర చిత్రాలతో పాటు పలు షార్ట్ ఫిల్మ్స్‌లో ఆమె నటించారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ చౌరస్తాల్లో అనాథలకు అన్నదానం చేస్తూ మానవసేవలో ముందుండి, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. నటిగా మొదటిసారి ఆట సభల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని లోరా మేదిసన్ సంతోషం వ్యక్తం చేశారు.

చైన్ స్నాచింగ్ నిందితుల అరెస్ట్

ఆర్మూర్‌టౌన్, జూన్10: చైన్ స్నాచింగ్ చేసిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మోర్తాడ్, బాల్కొండ మండలాల్లో చైన్ స్నాచింగ్ చేసిన నిందితులను పట్టుకున్న మోర్తాడ్ ఎస్సై అనిల్ రెడ్డి, సురేశ్, నారాయణ, నవీన్ చంద్రులను అభినందించారు. నిందితుల వద్ద నుంచి 15.7 తులాల బంగారం, ఒక స్కూటీ, ఒక పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, జూన్10: పట్టణంలోని 24వ వార్డులో శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య సంబంధిత అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ వానకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండకుండా ముందస్తుగా డ్రైనేజీల్లోని చెత్తను తొలగిస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీల్లో ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లు ఉన్నాయని వీటి వాడకాన్ని తగ్గించాలని ప్రజలను కోరారు. ప్రతి దుకాణం, హోటళ్లలో ఎక్కువ శాతం ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారని అన్నారు.

స.హ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

బోధన్, జూన్ 10: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్, మాజీ న్యాయమూర్తి ఎంఏ సలీం అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని నీటిపారుదల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సహ చట్టం అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బోధన్ డివిజన్‌లోని పలు కార్యాలయాల్లో సహ చట్టం డిస్‌ప్లే బోర్డులు లేవని, ఇప్పటికైనా సహ చట్టం- 2005 బోర్డులను ఏర్పాటు చేసి వాటిపై ప్రజా సమాచార అధికారి, సహాయ అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు ఫోన్ నంబర్లు ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ ఫర్వేజ్, డివిజన్ కార్యదర్శి సయ్యద్ మౌలానా, డివిజన్ ప్రతినిధులు మహ్మద్ లాయ ఖుద్దీన్, నర్సింలు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేల్పూర్, జూన్ 2 : వేల్పూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. మోర్తాడ్‌కు చెందిన అప్రోజ్‌అలీ (50) ఆర్మూర్ వైపు నుంచి మోర్తాడ్ వెళ్తున్నాడు. పడిగెల్ ఒడ్డెర కాలనీకి చెందిన గణేశ్ ఎదురుగా వస్తున్నాడు. రెండు బైకులు ఎదురెదురుగాఢీకొనడంతో అప్రోజ్‌అలీకి తీవ్ర గాయాలయ్యాయి. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వినోద్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రెంజల్, జూన్ 10: మండలంలోని సాటాపూర్ శివారులో అక్రమంగా ఇసుక లోడ్‌తో తరలివెళ్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై సాయన్న సోమవారం తెలిపారు. బోధన్ మండలం పెగడపల్లి వైపు నుంచి ఇసుక లోడ్‌తో సాటాపూర్‌కు వస్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా అనుమతి పత్రాలు లేకపోవడంతో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి,తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారులకు అప్పగించినట్లు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న చెప్పారు.